సాక్షి
కర్నూలు

సోమవారం ၊ 14 ၊ ఏప్రిల్ ၊ 2025



పెద్ద దిక్కు లేదు!

కర్నూలు పెద్దాసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. 14 నెలల తర్వాత నేడు ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహిస్తున్నారు. 8లో▸



కర్నూలులో భారీ చోరీ

కర్నూలు నగరంలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసి 42 తులాల బంగారు నగలు మూటగట్టుకొని ఉడాయించారు. పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు. 8లో▸



శ్రీమఠం.. భక్తజన సంద్రం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో శ్రీమఠం భక్తులతో కిక్కిరిసి పోయింది.

న్యూస్‌రీల్

పురుగు మందులు ఎక్కువగా వాడొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణారావు

కర్నూలు(అగ్రికల్చర్): సాగులో పురుగు మందులు అధికంగా వాడొద్దని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ప్రధాన కీటక శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లను ఆశ్రయిస్తుంటారని, పురుగు మందుల వినియోగంపై సూచనలు చేయాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఆదివారం ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ నిర్వహించారు. పురుగుమందులు రైతులకు ఇచ్చే సమయంలో సూచనలు చేయాలని పేర్కొన్నారు. సింథటిక్ పైరిథ్రాయిడ్స్ పురుగుమందులను ఎక్కువ సార్లు పిచికారీ చేయరాదన్నారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి నేపథ్యంలో ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

కేపహెచ్‌వోఎస్‌ఏ అధ్యక్షుడిగా సకారం



సకారం



నాగరాజు

కర్నూలు(అగ్రికల్చర్): అనిమల్ హజ్బెండరీ ఆఫీసర్స్ సర్వీస్ అసోషియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ (కేపహెచ్‌వోఎస్‌ఏ) అధ్యక్షుడిగా బనగానపల్లి ఏరియా హాస్పిటల్ ఏడీ డాక్టర్ సకారం ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీ డోన్ ఏడీ డాక్టర్ నాగరాజు, కోశాధికారిగా రుద్రవరం ఏడీ గిడ్డయ్య, ఉపాధ్యక్షుడుగా పత్తికొండ ఏడీ డాక్టర్ రవిప్రకాశ్‌రెడ్డి గెలుపొందారు. కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్ధ పశువైద్యశాల ప్రాంగణంలో ఆదివారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఐదు పోస్టులకు ఎన్నికలు జరుగగా ఒక పోస్టు ఏకగ్రీవం అయ్యింది. ఎన్నికల అధికారిగా కె.సత్యనారాయణ వ్యవహరించారు.

యూడీఐడీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న దివ్యాంగ ఉద్యోగ నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వివిధ ప్రతిభావంతులైన ప్రభుత్వ ఉద్యోగులందరూ యూడీఐడీ (యూనిక్ డిజేబులిటీ గుర్తింపు కార్డు) కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం శివారెడ్డి, కే కృష్ణుడు కోరారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి రాయితీలు పొందాలన్నా యూడీఐడీ చాలా అవసరమన్నారు. అలాగే బధిరులు (మూగ, చెవుడు) బైక్, కారు డ్రైవింగ్ లైసెన్స్‌లను పొందాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి రోస్టర్ 1 బ్లైండ్, రోస్టర్ 26 మూడ, చెవుడు, రోస్టర్ 51 ఓహెచ్ వారు తప్పక ఉపయోగించుకోవాలన్నారు. దివ్యాంగుల చట్టం 216లోని అంశాలను ప్రతి దివ్యాంగ ఉద్యోగి తప్పక ఉపయోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం సలహాదారు ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఢమాల్

- లక్ష్య సాధనలో వెనుకబడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- లక్ష్యం రూ.490 కోట్లు.. వసూలు రూ.226.45 కోట్లే
- పుంజుకోని రియల్ ఎస్టేట్, అధికారుల నిర్లక్ష్య ప్రభావాలే కారణం
- కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచినా కనిపించని ఆదాయం
- అసైన్‌మెంట్, ఇనాం భూముల రిజిస్ట్రేషన్ల నిలుపుదలతో అంతా అస్తవ్యస్తం



కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ స్థిరాస్తి ఆదాయం లక్ష్యానికి సగం దూరంలోనే నిలిచి పోయింది. గతేడాదితోపాటు పోల్చుకుంటే బాగా క్షీణించింది. స్థిరాస్తి ఆదాయ లక్ష్య సాధనలో వెనుకబడడానికి ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల నిర్లక్ష్యాలే కారణంగా తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా 1,30,618 దస్తావేజుల ద్వారా జరిగిన ఆదాయ స్వీకరణలో 46.33 శాతం మాత్రమే సాధ్యమైంది. ఇది గతేడాదితో పోల్చుకుంటే చాలా తక్కువ. వృద్ధి రేటు కూడా -8 శాతం నమోదైంది.

2023-24(గతేడాది) సంవత్సరంలో కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో రూ.445.97 కోట్లను లక్ష్యంగా నిర్దేశించగా రూ.226.75 కోట్లను స్థిర, చరాస్తుల అమ్మకాలు, కొనుగోళ్ల ద్వారా ఆదాయాన్ని రాబట్టారు. ఈ ఆదాయం 2023-24లో వచ్చిన ఆదాయంతో సమానమైంది. అంటే ఆ సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం తక్కువ కాగా, పైగా ఈ ఏడాది రిజిస్ట్రేషన్ చార్జీలను దాదాపు 45 శాతానికి పెంచినా లక్ష్యానికి చేరువ కాలేకపోయింది.

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

ఆదాయం సమకూర్చడంలో కర్నూలు, కల్లూరు, ఆదోని, ఎమ్మిగనూరు కీలకం. అయితే అధికారులు సరైన సమయంలో స్పందించి సబ్ రిజిస్ట్రార్లను నియమించలేదు. ఏకంగా కల్లూరు, కర్నూలు, ఆదోని సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఐదు నెలల పాటు ఇన్‌చార్జిలతో నడిపారు. దీంతో సరైనా ఆదాయం సమకూరడంలో ఇన్‌చార్జిలకు కొన్ని ఆటంకాలు ఎదురయ్యా యి. సాధారణ బదిలీల్లో ఆయా ఎస్ఆర్‌లను ఏ సబ్ రిజిస్ట్రార్ ఎంచుకోలేదు. దీంతో మూడునెలల తరువాత ఆదోనికి డోన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న హజీమియ్యాను నియమించారు. అయితే అతను కొన్నాళ్లకే అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సస్పెండ్ అయ్యారు. తరువాత అక్కడికి సబ్ రిజిస్ట్రార్ అరుణ్ కుమార్‌ను నియమించారు. దాదాపు 5 నెలల తరువాత కల్లూరుకు ప్రవీణ్‌కుమార్‌ను సబ్‌రిజిస్ట్రార్ నియమించారు. ఇప్పటికే కర్నూలు ఆర్ఓ ఇన్‌చార్జితోనే నడుస్తోంది.

ప్రభుత్వ విధానాలే కారణం

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రభుత్వ విధానాలతో కుప్పకూలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూముల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేసింది. అంతేకాక రీసర్వేపై కొనసాగించడంపై త్వరగా నిర్ణయం తీసుకోలేక పోయింది. భూముల మ్యూటేషన్లపై గందరగోళం సృష్టించింది. దీంతో కొత్త వెంచర్ల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నా రిజిస్ట్రేషన్ ఫీజులను భారీగా పెంచింది. దీంతో కొనుగోలుదారులు క్రయ, విక్రయాలకు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా కర్నూలు, కల్లూరు, ఆదోని లాంటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు రూ.100కుపైగా జరిగే రిజిస్ట్రేసన్ల సంఖ్య సగానికి పడిపోయింది. దీంతో వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందని సంబరపడిన కొందరు వ్యాపారులు ఇప్పుడు డీలా పడ్డారు.



కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

పది కార్యాలయాల్లోనే అంతే..

కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఒక్క ఆలూరు తప్పా మిగతా చోట్లా లక్ష్యం మేరకు ఆదాయం సిద్ధించలేదు. ఆలూరులో రూ.12.76 కోట్ల లక్ష్యం మేరకు 11.18 కోట్ల ఆదాయం రాగా 87 శాతం నమోదైంది. తరువాత ఆస్పరిలో 78.23 శాతం, ఎమ్మిగనూరులో 77 శాతం నమోదైంది. అతి తక్కువగా కోడుమూరులో 24.79 కోట్లకుగాను 12.83 కోట్ల ఆదాయం వచ్చి 52 శాతం నమోదైంది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఆదాయం ఇలా (రూ.కోట్లలో)

కార్యాలయం	నిర్దేశించిన లక్ష్యం	వచ్చిన ఆదాయం	శాతం
ఆదోని	56.00	37.03	68
ఆలూరు	12.76	11.18	87
ఆస్పరి	7.08	5.58	78
గూడూరు	17.50	9.92	56
కోడుమూరు	24.29	12.83	52
కోసిగి	12.97	9.19	70
పత్తికొండ	18.33	12.74	69
ఓర్వకల్లు	19.55	10.6	54
ఎమ్మిగనూరు	33.03	24.07	75
కర్నూలు	152.12	85.47	56
కల్లూరు	137.49	78.26	60

పర్యవేక్షణ లేక..

గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన సాధారణ బదిలీల నుంచి కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మార్కెట్ వ్యాల్యూ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న చెన్నకేశవరెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించారు. అయితే అతను మొదటి నుంచి జిల్లా రిజిస్ట్రార్ బాధ్యతలను చేపట్టడానికి ఆయన విముఖంగా ఉన్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం నుంచి సెలవులో ఉన్నారు. దీంతో మార్కెట్ వ్యాల్యూ జిల్లా రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ రెండు పోస్టులను డీఐజీ పీజీ కల్యాణికి అటాచ్ చేశారు. అయితే మూడు పోస్టులను ఆమె నిర్వర్తించాల్సి ఉండడంతో సరైన పర్యవేక్షణ లేక ఆదాయానికి గండి పడింది.

జిల్లా విద్యార్థినులకు సన్‌షైన్ స్టార్ అవార్డులు



ఉప్పరి సునీత, బోయ హరిత, టి.మానస

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలల్లో చదువుతూ ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో సన్‌షైన్ అవార్డులను ఇవ్వనున్నారు. ఇంటర్మీడియట్‌లో 7 రకాల గ్రూప్‌లకు ఒక్కో గ్రూప్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఒక విద్యార్థికి అవార్డులను రేపు(మంగళవారం) విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ టి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు కేజీబీవీలో ఇంటర్మీడియట్ సెకండియర్ ఎంపీసీ గ్రూప్ చదువుతూ ఉప్పరి సునీత 983 మార్కులు సాధించి సన్‌షైన్ అవార్డుకు ఎంపిక అయ్యారన్నారు. ఓర్వకల్లు కేజీబీవీలో ఎంఈసీ గ్రూప్ చదువుతున్న బోయ హరిత 913 మార్కులు సాధించి, పంచలింగాల కేజీబీవీలో అకౌంట్స్ అండ్ టాక్సెషన్ గ్రూప్‌లో టి.మానస 992 మార్కులు సాధించి అవార్డులకు ఎంపికయ్యారన్నారు.

సర్వీస్ వివరాలతో పదోన్నతులు

కర్నూలు సిటీ: సర్వీసు ప్రొఫైల్ వివరాల ఆధారంగానే భవిష్యత్తులో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు ఉంటాయని డీఈఓ ఎస్. శామ్యూల్ పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సర్వీస్ ప్రొఫైల్ వివరాలను టీఐఎస్(టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)ఫేషియల్ యాప్‌లో ఉన్నాయని, మరోసారి సరి చూసుకోవాలని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 5 గంటలలోపు ఆధారాలతో హెచ్ఎం, ఎంఈఓల ద్వారా డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలని తెలిపారు.

ప్రభుత్వ బడిని కాపాడుకోవాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులందరూ పోరాటాలు చేసి ప్రభుత్వ బడిని కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని సీక్యాంపులో ఆదివారం యూటీఎఫ్ నూతన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ముందుగా ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ అధ్యక్షతన విద్యా రంగ సవాళ్లు-కర్తవ్యాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం ప్రశ్నించేతత్వం లేకుండా చేస్తోందన్నారు. పాలక వర్గాల ప్రయోజనాల కోసమే విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని ఆరోపించారు. ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పించకుండా ఇతర పనులు చేయిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే 117 జీఓ రద్దు చేస్తామని పాదయాత్రలో లోకేష్ హామీనిచ్చారని, దాన్ని రద్దు చేయకుండా ప్రత్యామ్నాయం కోసం కసరత్తు చేస్తున్నారన్నారు. 2018లో 38 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండేవారని, కానీ నేడు అది 32.61 లక్షల మందికి తగ్గిందన్నారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. పీఆర్‌సీ ఏర్పాటు చేయాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు జయచంద్రారెడ్డి, లక్ష్మీరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, పూర్వ గౌరవ అధ్యక్షులు నరసింహులు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వి రమణయ్య, సుబ్బారెడ్డి, పూర్వ సహాధ్యక్షుడు నాగమణి, పూర్వ కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీశైల భ్రామరీకి కుంభోత్సవం



శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైలంలో వెలసిన భ్రమరాంబాదేవికి మంగళవారం కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం అమ్మవారికి ఆలయ అర్చకులు ఖడ్గమాల, అష్టోత్తర శతనామ కుంకుమ పూజలు, జపపారాయణలను నిర్వహిస్తారు. అనంతరం భ్రమరాంబాదేవికి కొబ్బరికాయలు, నిమ్మకాయలు, గుమ్మడికాయలతో తొలి విడత సాత్వికబలి సమర్పిస్తారు. కుంభోత్సవంలో భాగంగానే హరిహరరాయగోపురం వద్ద ఉన్న మహిషాసురమర్దిని అమ్మవారికి (కోటమ్మవారికి) ప్రత్యేక పూజలు జరిపించి సాత్విక బలి సమర్పిస్తారు. సాయంత్రం మల్లికార్జున స్వామివారికి ప్రదోషకాల పూజల అనంతరం అన్నాభిషేకం జరిపించి ఆలయ ద్వారాలు మూసివేస్తారు. అనంతరం అమ్మవారి ఆలయానికి ఎదురుగా సింహ మండపం వద్ద అనాన్ని రాశిగా పోసి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పిస్తాడు. రెండోవిడత సాత్వికబలిని సమర్పించిన తర్వాత భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి తొమ్మిది రకాల పిండివంటలతో మహా నివేదన చేస్తారు. కుంభోత్సవాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం, ఏకాంతసేవ, అన్ని ఆర్జిత సేవలు నిలుపుదల చేశారు.

రమణీయం.. రథోత్సవం

తర్తూరులో వెలసిన శ్రీ లక్ష్మీరంగనాథుని రథోత్సవం కనులపండువగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి రథంపై కొలువుంచారు. కుమ్మరులు బోనం తెచ్చిన తర్వాత రథాంగ పూజల అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. దివ్యమంగళ రూపుడైన రంగనాథుడు రథంపై విహరిస్తూ ముందుకు సాగగా భక్తజనం దర్శించుకుని తరించారు. మండే ఎండలను లెక్కచేయకుండా స్వామివారి రథోత్సవాన్ని కనులారా తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. డీఎస్పీ రామాంజనేయనాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, సీఐలు లక్ష్మీనారాయణ, తిరుపాలు, సురేష్‌బాబు అధ్వర్యంలో పటిష్టమైన భారీబందోబస్తు నిర్వహించారు. - జూపాడుబంగ్లా



రంగనాథుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

ప్రభుత్వ ఇంటర్ విద్య.. ఇక మిథ్య!

- ఈ నెల 7 నుంచి 23 తేదీ వరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు
- ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలను పట్టించుకోని బోర్డు అధికారులు
- కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన యాజమాన్యాలు
- ఇంటర్ బోర్డులో మెంబర్‌గా నారాయణ కాలేజీ ప్రిన్సిపాల్



కర్నూలు సిటీ: రాష్ట్ర పెద్దలు ప్రభుత్వ ఇంటర్ విద్యను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేయకుండా పరోక్షంగా కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు మేలు చేసేలా సంస్కరణల తీసుకొచ్చారు. కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలో అదనపు సెక్షన్లకు అనుమతులు సైతం ఇచ్చారు. విద్యను సామాజిక సేవగా భావించకుండా కొన్ని 'కార్పొరేట్' సంస్థలు వ్యాపారంగా మార్చాయి. రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన మంత్రిగా పనిచేస్తున్న నారాయణకు చెందిన విద్యా సంస్థల ప్రతినిధిని ఇంటర్మీడియట్ బోర్డులో నియమించారు. బోర్డు చరిత్రలో ఎప్పుడు కూడా కార్పొరేట్ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాల్‌ను మెంబరుగా నియమించలేదు. గత ప్రభుత్వం మండలానికి రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న ప్రభుత్వ ఇంటర్ విద్యను పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరమయ్యేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ ఇవ్వాలంటే కచ్చితంగా పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలి. అయితే హాల్ టికెట్‌పై అడ్మిషన్ ఇవ్వాలని బోర్డు చెప్పింది. అయినప్పటికీ 'పది' పరీక్షల ఫలితాలు రాకుండా ఎలా అడ్మిషన్ ఇవ్వాలో అర్థంకాక ఇంత వరకు దరఖాస్తులు ఇచ్చినా అడ్మిషన్ చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

'నారాయణ' పెత్తనం

ఇంటర్మీడియట్ బోర్డు అడ్మినిస్ట్రేటివ్ మెంబర్లుగా, ఎక్స్ ఆఫీషియో మెంబర్లుగా పది మందిని, యూనివర్సిటీ వీసీలుగా పని చేస్తున్న వారిని నలుగురిని నామినేట్‌గా ఎంపిక చేస్తారు. వీరితో పాటు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, కేజీబీవీ, రెసిడెన్షియల్ కాలేజీలకు చెందిన వారిని మెంబర్లుగా నియమించాలి. అయితే ప్రైవేటు కాలేజీలకు చెందిన వ్యక్తిని నియమించాలని ఎక్కడా లేదని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఎప్పుడూ లేకపోయినా బోర్డులో ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన ఎ.ఆనంద కిరణ్ అనే నారాయణ విద్యా సంస్థలకు చెందిన ప్రిన్సిపాల్‌ను నియమించారు. ఆయన సూచనల మేరకే అకడమిక్ క్యాలెండర్‌లో మార్పులు చేసి, పది పరీక్షల ఫలితాలు రాకముందే అడ్మిషన్ల షెడ్యూల్ జారీ చేశారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జూనియర్ కళాశాలల వివరాలు..

కళాశాల పేరు	సంఖ్య
ప్రభుత్వ జూనియర్	44
ఏపీ మోడల్	35
కేజీబీవీ	53
ఏపీ రెసిడెన్షియల్	02
సోషల్ వెల్ఫేర్	14
జ్యోతిరావు పూలే	04
ఎయిడెడ్	04
ట్రైబల్ వెల్ఫేర్	03
వొకేషనల్	03
హైస్కూల్ ప్లస్	04
ప్రైవేటు	147
మొత్తం	313

సర్వత్రా విమర్శలు

ప్రతి ఏటా జూన్‌లో జూనియర్ కాలేజీల తరగతులు పునఃప్రారంభం అయ్యేవి. కానీ కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణల ప్రకారం అంటూ ఈ నెల 1వ తేదీ నుంచే జూనియర్ కాలేజీల తరగతులు పునఃప్రారంభించారు. ఫస్ట్ ఇయర్ తరగతుల అడ్మిషన్ల కోసం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7 నుంచి 23వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. పది తరగతి పరీక్షల మూల్యాంకనం ఇటీవలే పూర్తి అయ్యింది. ఫలితాలు రావాలంటే మరో పది, పన్నెండు రోజులు పడుతుంది. అసలు ఫలితాలే రాకుండా జూనియర్ కాలేజీల్లో ఎలా అడ్మిషన్లు ఇస్తారో తెలియక ఇంత వరకు ప్రభుత్వ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా రాలేదని తెలుస్తోంది. సంస్కరణల పేరుతో కార్పొరేట్ కాలేజీలు ఏటా ముందస్తునే అనధికారికంగా అడ్మిషన్లు చేసుకునే వారు. వీటిపై ఏటా విమర్శలు వస్తుండడంతో కూటమి ప్రభుత్వం అధికారికంగా అడ్మిషన్లకు అనుమతులు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఉత్తర్వులను అమలు చేస్తున్నాం

ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ నెల 1వ తేదీ నుంచే సెకండ్ ఇయర్ తరగతులు ప్రారంభించాం. ఫస్ట్ ఇయర్‌కు 7వ తేదీ నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నాం. అకడమిక్ ఇయర్ క్యాలెండర్‌ను జారీ చేసి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తున్నాం.
- గురవయ్య శెట్టి, ఆర్ఐఓ, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి

ట్రాన్స్‌జెండర్లకూ ఉపాధి చూపాలి

- ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ జగదీష్



మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

కర్నూలు(హాస్పిటల్): ట్రాన్స్‌జెండర్లకూ సంక్షేమ పథకాలు అందించాలని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని బెంగళూరులోని వైదేహి మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ ఎస్. జగదీష్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో రెండురోజులుగా కొనసాగుతున్న ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. జగదీష్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్స్ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ యాక్ట్ 2020లో వచ్చిందన్నారు. ఇతరుల మాదిరిగానే ట్రాన్స్‌జెండర్లకూ ఆరోగ్య సమస్యలు ఉంటాయని, వాటి గురించి వైద్యులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇటీవల కాలికట్‌లో ఓ ట్రాన్స్‌జెండర్ ప్రసవనొప్పులతో వచ్చారని, ఇలాంటి వారికి ఏ విధమైన చికిత్సను అందించాలో వివరించారు. కొందరు పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. కొంత మంది ట్రాన్స్‌జెండర్స్ భిక్షాటన చేస్తూ అల్లరి చేస్తున్నారని, వారిని ఎలా నియంత్రించాలో అర్థం కావడం లేదని చెప్పారు. దీనిపై డాక్టర్ జగదీష్ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ట్రాన్స్‌జెండర్స్ అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించిందన్నారు. వారికి సంక్షేమ పథకాలు అందించడమే గాక నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. చాలా మంది ఆరోగ్య సమస్యలున్నా ఆసుపత్రికి వచ్చి చెప్పుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి వారికి ఆన్‌లైన్ ద్వారా ఉన్నచోటే వైద్యుల సలహాలు, సూచనలతో వైద్యం అందుకునే వెసలుబాటు ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇందుకు వారు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనాథలైన ట్రాన్స్‌జెండర్లకు ఆశ్రయం కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం గరిమా గృహ ప్రారంభించిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ అని చెప్పడానికి ఎలాంటి సర్టిఫికెట్ అవసరం లేదని, సంక్షేమ పథకాలు పొందాలంటే మాత్రం గుర్తింపుకార్డు ఉండాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై పలువురు ఫోరెన్సిక్ వైద్యులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ సాయిసుధీర్, ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వైకేసీ రంగయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె. నాగార్జున, డాక్టర్ వి. కోటేశ్వరరావు, డాక్టర్ పి. హరీష్‌కుమార్, డాక్టర్ వి.సురేఖ, డాక్టర్ మహమ్మద్ సాహిద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆయుష్ వైద్యుల సంఘం అడహాక్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రామా సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ (రామా) జిల్లా అడహాక్ కమిటీ ఎన్నికైంది. ఆదివారం అసోసియేషన్ సమావేశం స్థానిక గౌరిగోపాల్ హాస్పిటల్ వద్ద ఉన్న డాక్టర్ సులోచన ఎమర్జెన్సీ హోమియో హాస్పిటల్‌లో నిర్వహించారు. అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ బందారు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అడహాక్ కమిటీ ఎన్నిక చేశారు. జిల్లా ప్రెసిడెంట్‌గా పీవీ నాగరాజ, వైస్ ప్రెసిడెంట్‌గా డీఏ పద్మనాభరెడ్డి, ప్రసాద్, జనరల్ సెక్రటరీగా జె.యదుభూషణ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా నవీన్‌కుమార్, ట్రెజరర్‌గా రజాక్ బాషా, ఉమామహేశ్వరి, మహిళా శాఖ అబ్జర్వర్లుగా స్వర్ణలత, లక్ష్మీషాలిని, లీష్మా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సురేష్‌కుమార్, నాగరాజు, ఫయాజ్, అమర్‌నాథ్, చీఫ్ అడ్వయిజర్‌గా డీఏ పద్మనాభరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టి. చంద్రశేఖర్‌రెడ్డి, మురళీధర్, స్వర్ణలత, అఖిల, పి. ప్రభాకర్‌రెడ్డి, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తుగ్గలి:మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన వెంకటేష్(30) అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జొన్నగిరి ఎస్ఐ ఎన్‌సీ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన రాజేశ్వరితో స్నేహం ఏర్పడడంతో వెంకటేష్ రెండేళ్ల క్రితం ఆమెను స్వగ్రామానికి తీసుకొచ్చాడు. సహ జీవనం చేస్తూ జీవిస్తున్న వీరి మధ్య మనస్పర్థలు రావడంతో గత నెల 14వ తేదీన రాజేశ్వరి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వెంకటేష్ ఒంటరి జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంటి పైకప్పు గరండాకున్న ఇనుప కొక్కీకి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి తండ్రి మల్లికార్జున ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదివారం తెలిపారు.

సెల్‌ఫోన్ల దొంగల అరెస్ట్

డోన్ టౌన్: సెల్‌ఫోన్‌లను చోరీ చేసే దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 11వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున కారులో సెల్‌ఫోన్లు తరలిస్తుండగా అనుమానం వచ్చిన బీట్ కానిస్టేబుల్ తనిఖీ చేశారు. కారులో ఉన్న వంశీ, ప్రేమ్ అనే ఇద్దరిని, చోరీ చేసిన సెల్‌ఫోన్లను, కారును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కారులో ఉన్న సెల్‌ఫోన్లు, నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వారి ఇంటిలో సోదాలు చేశారు. మరికొన్ని సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోని విచారణ చేపట్టారు. ఈ విషయంపై పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా మాట్లాడుతూ.. విచారణ చేస్తున్నది వాస్తవమేనని, సోమవారం నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- ఎల్లెల్సీలో పడి యువకుడి మృతి

హాలహర్వి: సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు మృతి చెందాడు. గూళ్యం గ్రామంలో ఆదివారం ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గూళ్యం గ్రామానికి చెందిన శివప్ప(18) అనే యువకుడు పొలం పనులు ముగించుకుని తోటి స్నేహితులతో కలిసి ఎల్లెల్సీలో ఈతకు వెళ్లాడు. స్నేహితులు కాలువలో ఈత కొడుతుండడం చూసి తాను కూడా ఈత నేర్చుకోవాలని శివప్ప మెల్లగా ఈదుకుంటూ కాలువలోకి వెళ్లాడు. ఎక్కువ దూరం వెళ్లి నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన తోటి స్నేహితులు కాలువలో గాలించగా శివప్ప శవమై తేలాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గంగమ్మ, మారెప్పలు కన్నీరుమున్నీరుగా విలపించారు.



శివప్ప (ఫైల్)

పెద్ద దిక్కులేదు!





రోగి కుటుంబసభ్యులే స్ట్రెచర్ తోసుకెళ్తున్న దృశ్యం, ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్ బయట చెట్ల నీడన సేదతీరుతున్న రోగుల సహాయకులు, కుటుంబసభ్యులు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అందరికీ పెద్ద దిక్కులాంటిది. జిల్లా నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి సైతం ఈ ఆసుపత్రిని నమ్ముకుని చికిత్స కోసం రోగులు వస్తుంటారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్యం అందించాల్సిన ప్రభుత్వం తూతూ మంత్రంగా సేవలందిస్తోంది. సగానికి పైగా మందులు, వైద్యపరీక్షలు బయటకు వెళ్తున్నాయి. నాలుగో తరగతి ఉద్యోగుల మామూళ్ల దందా ఆగడం లేదు. మధ్యలో ఆగిపోయిన ఐపీ బిల్డింగ్ నిర్మాణంతో పడకలు చాలక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నర తర్వాత నేడు ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక కథనం.

- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పెద్దాసుపత్రి
- మందులు, వైద్యపరీక్షలు బయటకే...!
- తూతూ మంత్రంగా వైద్యసేవలు
- ప్రైవేటులో రోగుల జేబులు ఖాళీ
- నేడు ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ కౌంటర్‌ల వద్ద రద్దీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు జిల్లా నుంచే గాక నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్‌ఆర్, రాయచోటి, ప్రకాశం జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి రోజూ 2,500 మంది దాకా ఓపీ, 1,500 మంది ఇన్ పేషంట్లు చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు పీజీ వైద్య విద్యార్థులు ఆయా విభాగాల్లో అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాల్సి ఉంది. కానీ అనేక ఓపీ విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండటం లేదు. వచ్చినా కొద్దిసేపు ఉండి వెళ్తున్నారు. మరికొన్ని సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో అసలు ఓపీ నిర్వహించడం లేదు. నేరుగా వార్డుకు రమ్మని చెబుతున్నారు. అక్కడ వైద్యులు సకాలంలో ఉండటం లేదు. పీజీ వైద్యులే వారికి చికిత్స అందించి పంపిస్తున్నారు.

ఆగిన ఐపీ భవనం నిర్మాణంతో ఇక్కట్లు

గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా బోధనాసుపత్రిని రూ.500 కోట్లతో ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇన్‌పేషంట్ భవనాన్ని నిర్మించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఆసుపత్రిలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వెనుక వైపున దీని నిర్మాణం 2023లో జోరుగా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధుల లేమితో పనులు ఆగిపోయాయి. 80వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ భవనం నిర్మాణం పూర్తయితే జనరల్ మెడిసిన్, జనరల్ సర్జికల్ విభాగాలన్నీ ఇందులోకి వస్తాయి. ప్రస్తుతం పాత భవనాలన్నీ కూల్చివేయడంతో ఇతర విభాగాల్లో అసౌకర్యాల మధ్య రోగులు చికిత్స అందుకుంటున్నారు.

వైద్యసేవ కార్డు ఉంటేనే ఉచితం

ప్రభుత్వ సర్వజన వైద్యశాల అంటే ఉచితంగా వైద్యసేవలు అందించాలి. ఈ మేరకు అవసరమైన నిధులను ప్రభుత్వం పన్నుల ద్వారా ప్రజల నుంచే సేకరిస్తుంది. ఆ సొమ్ముతోనే వైద్యులు, ఉద్యోగులు, వైద్య సిబ్బందికి, ఆసుపత్రి నిర్వహణకు ఖర్చు పెడుతుంది. కానీ ఈ ఆసుపత్రిలో మాత్రం ఎన్‌టీఆర్ వైద్యసేవ కార్డు లేకపోతే కొన్ని విభాగాల్లో సేవలు అందడం లేదు. వైద్యుల సేవలు మాత్రం ఉచితంగా అందిస్తున్నారు. శస్త్రచికిత్సకు అవసరమైన పరికరాలు, మందులు, సర్జికల్స్ రోగులే బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఖర్చుచేసే స్థోమత లేకపోతే వెనక్కి పంపిస్తున్నారు. ముఖ్యంగా సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. తెలంగాణ, కర్ణాటక ప్రాంతానికి చెందిన రోగులకు కేవలం వైద్యుల సేవలు మాత్రమే అందుతున్నాయి. ఆసుపత్రిలో చేరితే ఇతర ఖర్చులన్నీ వారు పెట్టుకోవాల్సిన పరిస్థితి.

యథేచ్ఛగా ప్రైవేటు ల్యాబ్‌లకు పరీక్షలు

ఆసుపత్రిలోని డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో అన్ని పరీక్షలు చేయాలి. ఈ మేరకు అవసరమైన కిట్లను సైతం అధికారులు అందుబాటులో ఉంచారు. కానీ కొందరు వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు పలు రకాల వైద్యపరీక్షలు బయటకు రాస్తున్నారు. ప్రత్యేకంగా ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు ల్యాబ్ పేరు చెప్పి పంపిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఆసుపత్రి రివాలింగ్ గేటు వద్ద సదరు ల్యాబ్‌కు చెందిన వ్యక్తులు కాపుకాసి మరీ వారిని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేసి పంపిస్తున్నారు. రాత్రి పూట అయితే అత్యవసరంగా డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో చేయరని సాకుగా చూపి ప్రైవేటుకు వైద్యపరీక్షలు పంపిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైద్యుల పోస్టుల ఖాళీలతో ఇబ్బందులు

బోధనాసుపత్రిలో 224 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా అందులో ప్రస్తుతం 45 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 71 ప్రొఫెసర్ పోస్టులకు గాను 63 మంది పనిచేస్తుండగా 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 69 మంది అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు గాను 57 మంది పనిచేస్తుండగా 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా ఆయా విభాగాల్లో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు పోస్టులు భర్తీ చేసేవారు. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందుల కొరత తీవ్రం

ఆసుపత్రిలో ప్రస్తుతం 324 రకాల మందులు అందుబాటులో ఉండగా 47 రకాల మందుల కొరత ఉంది. ప్రధానంగా ఆల్బుమిన్స్, ఇన్సులిన్, పలు రకాల యాంటిబయాటిక్స్ మందులు, ఇంజెక్షన్లు, బ్లడ్‌శాంపిల్ ట్యూబ్‌లు, కొన్ని మాత్రమే ఇస్తున్నారు. ఎక్కువగా బయటకు రాస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందుల సరఫరా సరిగ్గా లేకపోవడంతో స్థానికంగానే అధికారులు మందులు అత్యవసరంగా కొనుగోలు చేస్తున్నారు. ఇన్సులిన్, ఆల్బుమిన్ ఇంజెక్షన్లు ఎక్కువగా స్థానికంగానే కొనుగోలు చేస్తున్నారు. అవి కూడా రోగులకు అరకొరగా ఇస్తున్నారు. గతంలో ఇన్సులిన్‌ను నెలకు సరిపోయే బాటిళ్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఒకటి మాత్రమే చేతిలో పెట్టి పంపిస్తున్నారు.

రాజ్యాంగ 'రూప'శిల్పి



బాదం ఆకుపై బాబాసాహెబ్



రక్తంతో వేసిన అంబేడ్కర్ చిత్రం

నేడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి. ఈ నేపథ్యంలో ఆదివారం కొందరు ఆయన చిత్రాన్ని అబ్బురపరిచేలా గీచి అభిమానం చాటుకున్నారు. ఇందులో ప్యాపిలి మండలం వెంగళాంపల్లికి చెందిన మధుకృష్ణ 2 గంటల 15 నిమిషాల వ్యవధిలో బాదం ఆకుపై అంబేడ్కర్ చిత్రాన్ని గీయగా.. నంద్యాల పట్టణం ఎన్‌జీఓ కాలనీకి చెందిన బ్యాంక్ ఉద్యోగి మాణిక్యరావు ఏకంగా తన రక్తంతో 2 గంటల్లో బాబాసాహెబ్ చిత్రాన్ని గీచి ఆయనను స్మరించుకున్నారు. - ప్యాపిలి /నంద్యాల వ్యవసాయం

ఆర్టీసీ డిపో మేనేజర్ ఇంట్లో భారీ చోరీ

- 42 తులాల బంగారు, రూ.50 వేల నగదు అపహరణ



దొంగలు చోరీ చేసి తెరచి వదిలేసిన కప్‌బోర్డు

కర్నూలు: కర్నూలు ఆర్టీసీ 2వ డిపో మేనేజర్‌గా పని చేస్తున్న జమ్మద్ సర్దార్ హుసేన్ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి మూటగట్టుకొని ఉడాయించారు. ఆయన నగరంలోని గణేష్‌నగర్ పక్కన ఉన్న సాయి వైభవ నగర్‌లో నివాసం ఉంటున్నారు. మనవరాలికి ఆరోగ్యం సరిగా లేదని తెలియనడంతో కుటుంబ సభ్యులతో కలిసి సర్దార్ హుసేన్ శనివారం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి గ్రిల్ తాళాలతో పాటు ప్రధాన తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. పడకగదిలో ఉన్న బీరువాను బద్దలు కొట్టి అలమారాలో ఉన్న 42 తులాల బంగారు నగలు, రూ.50 వేల నగదును మూటగట్టుకొని ఉడాయించారు. ఆదివారం ఉదయం పనిమనిషి ఇళ్లు శుభ్రం చేసేందుకు వచ్చే సరికి తలుపులు తెరచి ఉండడంతో ఫోన్ చేసి ఇంటి యజమానికి సమాచారం ఇచ్చింది. హుటాహుటిన ఆయన హైదరాబాద్ నుంచి కర్నూలుకు చేరుకొని చోరీ జరిగిందని నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, 3వ పట్టణ సీఐ శేషయ్య, ఎస్ఐ రహమాన్, సీసీఎస్ సీఐ శ్రీనివాసనాయక్ తదితరులు అక్కడికి చేరుకొని నేరం జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ సిబ్బందిని రప్పించి ఆధారాలు సేకరించారు. డాగ్ చోరీ జరిగిన ఇంటి వద్ద నుంచి కాలనీ చివరి వరకు వెళ్లి ఆగిపోయింది. చోరి జరిగిన విషయాన్ని తెలుసుకున్న కాలనీ ప్రజలు ఇంటి వద్దకు వచ్చి చూడడంతో పాదాల అచ్చులు పడి సరైన ఆధారాలు క్లూస్ టీంకు లభించలేదు. కాలనీలోని సమీపంలోని సీసీ ఫుటేజ్‌లను క్రైం పార్టీ సిబ్బంది సేకరించి పాత నేరస్తుల ఫొటోలతో జతపరిచి దొంగలను గుర్తించే పనిలో ఉన్నారు. బాధితుడు సర్దార్ హుసేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ సైనికుడి ఇంట్లో దొంగతనం

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో నివసిస్తున్న మాజీ సైనికుడు ధర్మారెడ్డి ఇంట్లో పట్ట పగలు చోరీ జరిగింది. ఈయన భార్యతో కలిసి శనివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఊరు పత్తికొండకు వెళ్లాడు. గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి వెనుక భాగం నుంచి గోడ దూకి తాళం పగుల గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 10 తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు అపహరించకుపోయారు. బాధితుడు శనివారం రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకొని చూడగా తాళం తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. దీనిపై వారు ఆదివారం విచారణ చేపట్టారు.

చిట్టి'తల్లి'కి సరస్వతీ కటాక్షం

- 'సాక్షి' చొరవతో లభించిన చేయూత
- ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన అక్కాచెల్లెలు



అక్కాచెల్లెళ్లు మల్లిక, శశిరేఖ



సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం

పత్తికొండ రూరల్: తల్లిదండ్రులు లేక ఎనిమిదేళ్ల వయసులోనే చెల్లెళ్లకు తల్లిగా మారి ఆలనా పాలన చూస్తున్న మల్లిక ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. పత్తికొండలోని అంబేడ్కర్ బాలికల గురుకులంలో చదువుతున్న మల్లిక ఇంటర్ సెకండియర్‌లో 983 మార్కులు సాధించారు. ఈ విద్యార్థిని దుస్థితిపై చిట్టి'తల్లి' శీర్షికన 31.08.2016న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు, మానవతావాదులు స్పందించారు. చిన్నతనంలోనే కన్నతల్లిదండ్రులకు దూరమైన ఐదుగురు ఆడబిడ్డలను చేరదీసి పాఠశాలకు పంపించారు.

ఇదీ విజయ గాథ..

పత్తికొండ మండల పరిధిలోని బుగ్గతండా గ్రామానికి చెందిన బనావత్ రమణమ్మ, రాంబాబునాయక్‌లకు మల్లిక, శశిరేఖ, ఇందు, లోకేశ్వరి, సింధు సంతానం. తల్లిదండ్రులు లేక నలుగురు చెల్లెల్లకు మల్లిక తల్లిగా మారింది. ఈ దయనీయ కథనాన్ని సాక్షి దినపత్రిక వెలుగులోకి తీసుకురావడంతో వారందరూ చదువులమ్మ ఒడికి చేరారు. కష్టాలను, కన్నీటిని బిగువన దిగమింగుకుని విద్యనభ్యసించారు. పత్తికొండలోని అంబేడ్కర్ బాలికల గురుకులంలో చదువుతున్న బనావత్ మల్లిక సెకండియర్‌లో 983 మార్కులు సాధించారు. ఆర్డీటీ సంస్థ సహకారంతో కర్నూలు శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్న శశిరేఖ ఫస్టియర్‌లో 464 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు.

క్యాన్సర్‌ను జయిస్తూ.. చదువులో రాణిస్తూ!

- బైపీసీలో 420 మార్కులు సాధించిన సృజనామృత



కుటుంబీకులతో విద్యార్థిని సృజనామృత

గోనెగండ్ల: ఓ విద్యార్థిని క్యాన్సర్‌ను జయిస్తూ ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. గోనెగండ్లకు చెందిన ఉరుకుంద గౌడ్, జానకి దంపతులకు కుమార్తె సృజనామృత, కుమారుడు భగీరథ్ గౌడ్‌లు ఉన్నారు. ఉరుకుంద ప్రస్తుతం కర్నూలు రెండో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. కర్నూలులోనే నివాసం ఉంటున్నారు. గత ఏడాది సృజనామృత పదో తరగతి చదువుతుండగా క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు బయటపడింది. మహమ్మారితో పోరాడుతూనే చదువు కొనసాగిస్తోంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉదయం రాసి మధ్యాహ్నం నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందింది. పరీక్షల్లో ప్రతిభ చాటుతూ 493 మార్కులు సాధించింది. అప్పటి నుంచి క్యాన్సర్‌తో బాధపడుతూనే కర్నూలులో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇంటర్ పరీక్షలు రాసింది. శనివారం విడుదలైన ఫలితాల్లో 420 మార్కులు సాధించింది. ఎంబీబీఎస్ సీటు సాధించి పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని సృజనామృత చెబుతోంది.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



క్రిష్ణదొడ్డిలో జనసందోహం మధ్య శ్రీవారి రథోత్సవం

సి. బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో శ్రీ కోన వేంకటేశ్వర స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాలతో పాటు గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూర్ మండలాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవానికి ముందు ఆలయ పూజార్లు గణపతి పూజ, పుణ్యహవాచనం, సంప్రోక్షణ గావించి అర్ధరాత్రి 12 గంటలకు కుంభం ను ప్రారంభించారు. ఆదివారం తెల్లవారు జామున 5 గంటలకు భక్తజనం మధ్య మహారథోత్సవం జరిగింది. తర్వాత పార్వేట నిర్వహించారు. శ్రీవారు, అమ్మవారి సమేత ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆశీనులు చేసి గ్రామంలో ఊరేగించారు.కాగా సోమవారం ఆది దంపతులకు వసంతోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రాణం ఇస్తావా

- వైఎస్సార్‌సీపీ నాయకుడిని బెదిరించిన ఆదోని ఎమ్మెల్యే పీఏ?
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కాల్ రికార్డింగ్

ఆదోని అర్బన్: 'నీ ప్రాణం ఇస్తావా' అని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పీఏ పేరుతో ఆదోనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడిని బెదిరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇరువురు ఫోన్‌లో మాట్లాడిన సంభాషణ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల కర్నూలులో డీడీఆర్‌సీ సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అధికారుల దృష్టికి పలు ప్రజా సమస్యలను తీసుకొచ్చారు. ఈ విషయంపై మధ్యలో కలగుజేసుకున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సమస్యలు ఉన్నాయని అడ్డు తగిలారు. దీనిపై వైఎస్సార్‌సీపీ పార్టీశ్రేణులు భగ్గుమన్నారు. ఆదోనికి చెందిన ఓ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తీరును ప్రశ్నిస్తూ మాట్లాడారు. దీనిని జీర్ణియించుకోలేక ఆదోని ఎమ్మెల్యే పీఏ ఒకరు వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఫోన్‌చేసి బెదిరించారు. ఆ సంభాషణ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

అంతా అయోమయం!

- ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఇంటర్ తరగతులు
- అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలా? తరగతులకు హాజరుకావాలా?
- కొరవడిన స్పష్టత
- వచ్చే నెల 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- ఈనెల 22 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలు...సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తుంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఈ నెల 1వ తేది నుంచే ప్రారంభించారు. పబ్లిక్ పరీక్షలు ముగిసిన రెండు వారాలకే సెకండియర్ విద్యార్థులకు తరగతులు సైతం మొదలు పెట్టారు. ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులు చాలా మంది ఫెయిల్ అయ్యారు. వారు సెకండియర్ తరగతులకు హాజరుకావాలా? ఫెయిల్ అయిన సబ్జెక్టులు చదువుకోవాలా? అనేది అర్థం కాని పరిస్థితి. దీనిపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేది. అయితే, ప్రస్తుత సర్కారు ఫస్ట్ ఇయర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని తెలుస్తుంది. ప్రతి ఏటా సప్లిమెంటరీ పరీక్షలు మే నెల చివరి వారంలో మొదలై, జూన్ మొదటి వారం వరకు ఉండేవి. అయితే, ప్రస్తుతం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం మే మూడో వారం నాటికే పరీక్షలు ముగియనున్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలు 20,420 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే, 14,859 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 5,561 మంది అనుత్తీర్ణులయ్యారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ప్రారంభమైన దరఖాస్తులు

ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు, మార్కులు తక్కువ వచ్చినవారు, వచ్చిన మార్కులపై అనుమానమున్న వారు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. రీకౌంటింగ్‌కి ఒక్కో పేపర్‌కు రూ.250, రీవెరిఫికేషన్‌తో పాటు, స్కాన్ చేసిన సమాధాన పత్రానికి ఒక్కో సబ్జెక్టుకు రూ.1300 చెల్లించాలి. ఇందుకు ఈనెల 13 నుంచి 22 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదిలోపు పరీక్ష ఫీజులు చెల్లించాలి. థియరీ పరీక్షలకు రూ.600, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.275, బ్రిడ్జ్ కోర్సుకు రూ.165, బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్ పరీక్షలకు రూ.275, ఫస్ట్ ఇయర్, సెకండియర్ థియరీ పరీక్షలకు రూ.1200, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు రూ.550, బ్రిడ్జి కోర్సు పరీక్షకు రూ.330, మొదటి, ద్వితీయ పరీక్షల్లో పాసై, మార్కులు పెంచుకునేందుకు ఆర్ట్స్ విద్యార్థులు రూ.1350, సైన్స్ విద్యార్థులు రూ.1600 చెల్లించాలి. ఈ పరీక్షలు వచ్చే నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయినవారికి వచ్చే నెల 28 నుంచి 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.